
సాక్షి బాపట్ల

శుక్రవారం । 19 । జూలై । 2024




మల్లేశ్వరుని కానుకల లెక్కింపు

పెదకాకాని: మల్లేశ్వరునికి కానుకల ద్వారా రూ.57,58,351 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాద రావు చెప్పారు. గురువారం లెక్కింపు చేపట్టారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1611 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.10 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నారా హంతక ముఠా నరమేధం

రక్తమోడుతున్న పల్నాడు

పగలు, ప్రతీకారాలను వదిలి ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పథాన పయనిస్తున్న పల్నాడులో 'నారా' హంతక ముఠా మళ్లీ ఫ్యాక్షన్ చిచ్చును రాజేసింది. ఎన్నికల్లో గెలుపు కోసం కరడుగట్టిన నేరస్తులను ఎగదోసి హింసాకాండను సాగించింది. ఎన్నికల రోజు, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులే లక్ష్యంగా దాడులు, విధ్వంసాలకు తెగబడింది. కుయుక్తులతో కూటమిగట్టి గెలిచిన తర్వాత కాల'కూటమై' కోరలు చాస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. నరమేధాన్ని సృష్టించి బలి కోరుతోంది. రక్తతర్పణాలతో పల్లెసీమలను తడుపుతోంది. రాక్షసానందంతో వికటాట్టహాసం చేస్తోంది.



వినుకొండలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే రషీద్‌ను కత్తితో నరుకుతున్న జిలాని

- దాడులు, హత్యాయత్నాలతో అట్టుడుకుతున్న జిల్లా
- నీచ రాజకీయాలకు ఫ్యాక్షన్‌ను ఎగదోసిన చంద్రబాబు
- గెలుపు కోసం కరడుగట్టిన హంతకులకు బాధ్యతలు
- ఎల్లో కూటమి విజయం తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు, హత్యలు
- తాజాగా పాశవిక హత్యతో రాక్షసత్వాన్ని చాటుకున్న పచ్చదండు



కారెంపూడిలో ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ నేత ఆటో కన్సల్టెన్సీలోని వాహనాలకు నిప్పు పెట్టిన దృశ్యం





బ్రాహ్మణపల్లిలో గాయపడిన సొసైటీ చైర్మన్ పిచ్చిరెడ్డి, పాటూరి శ్రీనివాసరావు



తుమ్మలచెరువులో క్షతగాత్రుడు



పెద అగ్రహారంలో గాయపడిన కృష్ణ



ముప్పాళ్ల మండలం తొండపిలో వాహనం ధ్వంసం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, నరసరావుపేట: ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో రగిలిన పల్నాడు గత ఐదేళ్లలో కక్షలకు దూరంగా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాటలెక్కింది. దీనిని చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పరిస్థితి ఇలాగే కొనసాగితే తన పార్టీకి మనుగడ ఉండదన్న భావనతో ఫ్యాక్షన్‌కు మళ్లీ ప్రాణం పోశారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న కరడుగట్టిన ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా నియమించారు. పల్నాడులో అలజడి సృష్టించేందుకు యత్నించారు. ఎన్నికల సమయంలో గెలుపే లక్ష్యంగా పచ్చమూకలను ఉసిగొలిపి దాడులు, విధ్వంసాలకు ఒడిగట్టారు. జిల్లాలోని 53 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఇళ్లపై పడి ఆస్తులు ధ్వంసం చేశారు. చాలా మందిని ఊళ్ల నుంచి తరిమేశారు.

ఎన్నికల ముందు నుంచే దాడులు

ఎన్నికల సమయంలో మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ సాగించిన విధ్వంసకాండకు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీఐజీ గానీ, ఎస్పీ గానీ, కలెక్టర్ గానీ స్పందించ లేదు. మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డిని ఎప్పుడైతే అభ్యర్థిగా ప్రకటించారో అప్పటి నుంచి అరాచకాలు మొదలయ్యాయి. పల్నాడును కైవసం చేసుకోవాలంటే జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే తమ పన్నాగాలు పారవని టీడీపీ నేతలు గుర్తించారు. అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరదని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా పావులు కదిపారు. తమకు అనుకూలంగా ఉండే అధికారులకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు.

టీడీపీ వేధింపులకు బలి




చిలకలూరిపేటలో తెలుగుదేశం నాయకుల దాష్టీకానికి ఓ నిండు ప్రాణం బలైంది. గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన జడ ఆనంద్ (38) ఎన్నోఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనంద్‌ను ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. లేకుంటే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తామని బెదిరించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆనంద్ పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య రత్నకుమారితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెంటపాళ్లలో మరొకరు..



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు (37) టీడీపీ నేతల ఒత్తిడితో, పోలీసుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగమల్లేశ్వరరావు ఇంటిపై, ఎస్సీ కాలనీపై దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో గ్రామం విడిచి వెళ్లకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపుతామని ఎస్‌హెచ్ఓ రాజేష్‌కుమార్ బెదిరించడంతో మనస్తాపం చెంది నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆర్ఎంపీపై హత్యాయత్నం



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పోట్లూరి శివయ్య వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశాడనే కోపంతో ఆయన ఇంటిపై టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేశారు. శివయ్య కుడి చేతికి కత్తిపోటుతో గాయమైంది. దీనిపై అప్పటి ఎస్పీ మలికా గార్గ్‌కు శివయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో రాజీ పడటం లేదని శివయ్యపై ప్రస్తుతం తప్పుడు కేసులు పెట్టేందుకు యత్నిస్తున్నారు.


రిగ్గింగ్‌కు తెగబడి..!

తుమ్మకోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. ఒప్పిచర్ల గ్రామంలో 250, 251, 252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితిని సృష్టించారు.

పిన్నెల్లి సతీమణిపై దాడి

ఎన్నికలకు మూడు రోజుల ముందు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి సిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై టీడీపీ నేతలు దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్ఐ ఇతర పోలీసు సిబ్బందిపైనా దాడికి తెగబడ్డారు.

పాశవిక చర్యలకు పరాకాష్ట



రాష్ట్రంలో కూటమి పాలనలో పాశవిక చర్యలు పరాకాష్టకు చేరాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నందునే అత్యంత దారుణాలు, దుర్మార్గాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దాడులు మొదలైనప్పుడే పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఉన్నట్లయితే ఇంతటి ఉన్మాద చర్యలు చోటుచేసుకునేవి కావు. టీడీపీ ముఖ్య నాయకులు ప్రోత్సహిస్తున్నందునే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బరితెగిస్తున్నారు. ఇలాంటి హేయమైన చర్యలను ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాల్సిందే.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ

పల్లెల్లో పచ్చ చిచ్చు

తొలుత ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో పచ్చమూకలు అలజడి సృష్టించాయి. దాడులను ప్రేరేపించాయి. మాచర్ల మండలంలోని కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు, రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, పాల్వాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు, కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల, కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి, దుర్గి మండలంలోని ముటుకూరు, అడిగొప్పల, పోలేపల్లి, వెల్దుర్తి మండలంలోని లోయపల్లి, వెల్దుర్తి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట గ్రామాల్లో టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. గురజాల నియోజకవర్గంలో పిన్నెలి, కేసానుపల్లి, మాదినపాడు, ఇరిగేపల్లి, తంగెడ, కొత్తగణేశునిపాడు, మాచవరం, బ్రాహ్మణపల్లి, పెదఅగ్రహారం, జానపాడు, నరసరావుపేట నియోజకవర్గంలో నరసరావుపేట పట్టణం, దొండపాడు, పమిడిపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో పాకాలపాడు, మాదల, తొండపి, చాగంటివారిపాలెం, నార్నెపాడు, గణపవరం, చీమలమర్రి, రూపెనగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చేజర్ల, వినుకొండ నియోజకవర్గంలో నూజెండ్ల, రెడ్డికొత్తూరు, బొల్లాపల్లి, కొచ్చర్ల, గంటావారిపాలెం, వినుకొండ పట్టణం, పెదకూరపాడు నియోజకవర్గంలో ఎర్రబాలెం, లగడపాడు, చంద్రాజుపాలెం, మాదిపాడు, చిలకలూరిపేట నియోజకవర్గంలోని అప్పాపురం గ్రామంలో పచ్చ ముఠాలు విధ్వంసం సృష్టించాయి.

ఎస్సీ మహిళలపై అరాచకం

రెంటచింతల మండలం తుమ్మకోటలో మే 13న ఓటు వేసేందుకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలపై టీడీపీలోని అగ్రకుల నాయకులు విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పటికే క్యూలైన్లలో ఉన్న మహిళలను కొట్టి తరిమివేసి టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ ఏజెంట్లను లాగి బయటకు గెంటేశారు.

మరిన్ని దురాగతాలు

- వినుకొండ నియోజకవర్గం నూజెండ్లలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ నాయకులపై రాళ్లు కర్రలతో దాడులు చేశారు. దాడిలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- కారెంపూడిలో టీడీపీ గూండాలు 500 మంది బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు.
- కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాలకేంద్రాన్ని ధ్వంసం చేసి తగలబెట్టారు. మాచర్ల రోడ్డులోని పోలిరెడ్డికి చెందిన టీ స్టాల్‌ను ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు. ఎంపీటీసీ వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్టెన్సీపై దాడి చేసి 40 బైక్‌లకు నిప్పు పెట్టారు.
- ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నిలిపి ఉంచిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు.
- మాచవరం మండలం కొత్త గణేశునిపాడు, కేసానుపల్లిల్లో మహిళలను కొట్టారు.



వంతపాడిన పోలీసులు



దాడులు చేసిన తెలుగుదేశం పార్టీ వారిని వదిలిపెట్టి పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెడుతూ వచ్చారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసులు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలపై హత్యాయత్నం కేసులలో నిందితుడైన టీడీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు, అతని అనుచరులను అరెస్ట్ చేయలేదు.

తాజాగా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను అతి దారుణంగా హత్య చేశారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి పల్నాడులో శాంతిని నెలకొల్పాల్సిన అవసరం జిల్లా యంత్రాంగంపై ఉంది.

పోలింగ్ రోజు విధ్వంసకాండ





ఎన్నికల రోజున నరసరావుపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి రెండు వందల మంది తెలుగుదేశం పార్టీ మూకలు మారణాయుధాలు చేతబట్టి దాడికి తెగబడ్డాయి. ఆ సమయంలో శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటి రెడ్డిపై టీడీపీ కిరాయి గూండాలు దాడి చేశారు.

గాయపడిన గోపిరెడ్డి మామ రామకోటిరెడ్డి

> ఎన్నికల ముందే కారెంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి టీడీపీ నేతలు బెదిరించారు. మే 12న రెంటచింతలలో పోలీసులు ఉండగానే మోర్తాల ఉమా మహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ వద్ద 201, 202 పోలింగ్ స్టేషన్లలోకి వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ తెలుగుదేశం నేతలు అనుమతించలేదు.

తొండపిలో మైనార్టీలపై పైశాచికం

సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ముస్లిం వర్గీయుల ఇళ్లల్లోకి టీడీపీ మూకలు చొరబడ్డాయి. మహిళలను, చిన్నారులని చూడకుండా దాడులకు తెగబడ్డాయి. ఈ తరుణంలో ముస్లిం కుటుంబాల్లోని మగ వారంతా ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ లోపలే ఉండిపోయారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

కొత్త గణేశునిపాడులో అరాచకం



గాయపడిన చౌదరి సింగరయ్య

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయలేదన్న అక్కసుతో ఆ పార్టీ నేతలు మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో అరాచకం సృష్టించారు. దాడుల్లో వైఎస్సార్ సీపీ నేతలు చౌదరి సింగరయ్య, దారం లక్ష్మీరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ నేతలకు భయపడి ఎస్సీ, బీసీ నేతలు ఊరు వదిలారు. మహిళలు, చిన్న పిల్లలు గంగమ్మ గుడిలో తలదాచుకున్నారు. ఇది తెలిసి పచ్చమూకలు గుడిపైకి రాళ్లు రువ్వారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ కుమార్, కాసు మహేష్‌రెడ్డిపైనా దాడులు చేశారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి నాయకులను గ్రామాలు దాటించాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ నేతలకు భయపడి పిన్నెల్లి గ్రామం నుంచి సుమారు 1,050 మంది పక్కనే ఉన్న తెలంగాణకు పరారై తల దాచుకుంటున్నారు. పిన్నెల్లిలో ఇప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. సాగు చేపట్టకపోవడంతో వందల ఎకరాలు బీడుగా మారాయి.



గాయపడిన దారం లక్ష్మీరెడ్డి

వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరిముల్లా



మార్టూరు: వినియోగదారుల సంఘం జిల్లా జిల్లా అధ్యక్షుడిగా వలపర్ల గ్రామానికి చెందిన సయ్యద్ కరిముల్లా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. తిరుపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వినియోగదారుల ఫోరాన్ని బలోపేతం చేయడానికి, హక్కులపై వినియోగదారులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని కరిముల్లా పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.తిరుపాల్, టి. శేషయ్య, ఉదయభాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూముల్ని అన్యాక్రాంతం కానివ్వం

తహసీల్దార్ సంధ్యశ్రీ



మార్టూరు: ప్రభుత్వ భూముల్ని అర్హత లేని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం తమ కార్యాలయంలో జరగదని స్థానిక తహసీల్దార్ కె.సంధ్యశ్రీ తెలిపారు. మార్టూరుకు చెందిన ప్రజాసంఘాల నాయకులు కలెక్టర్‌కు మార్టూరు గ్రామ సర్వే నంబర్ 640/ఏ లోని భూమిపై ఇచ్చిన ఫిర్యాదుతోపాటు సాక్షి దినపత్రికలో అధికార పార్టీ నాయకుల భూకబ్జా ప్రయత్నాలపై రాసిన కథనం నేపథ్యంలో ఆమె వివరణ ఇచ్చారు. మార్టూరుకు చెందిన తొండెపు ఆదిలక్ష్మి అనే మహిళ 640/ఏ సర్వే నంబరులో తనకు 30-1-2009న అప్పటి రెవెన్యూ అధికారులు రెండెకరాల భూమికి డీకే పట్టా ఇచ్చారని, దాన్ని వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని అర్జీ పెట్టిన విషయం వాస్తవమన్నారు. అయితే, తమ రికార్డుల పరిశీలనలో 2009లో 640/ఏ అనే సర్వే నంబర్ మనుగడలోనే లేదని, దీంతో ఆదిలక్ష్మికి ఇచ్చినట్లు చెబుతున్న భూమిని వెబ్‌ల్యాండ్‌లో కూడా నమోదు చేయలేదని తెలిపారు. ఈ భూ వివాదంతో పాటు మరో 35 ఎకరాల ఈనామ్ భూమిని అన్యాక్రాంతం అంటూ వచ్చిన వార్తకు సంబంధించి తమ కార్యాలయానికి ఎటువంటి అర్జీలు రాలేదని ఆమె వివరణ ఇచ్చారు. తమ కార్యాలయ సిబ్బంది చట్టపరిధికి లోబడే పారదర్శకంగా లావాదేవీలు నిర్వహిస్తున్నారని ఆమె వివరించారు.

అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండండి !

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ గురువారం వీక్షణ సమావేశం నిర్వహించారు. పశ్చిమ కృష్ణ డెల్టా నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేయడం, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదలు వచ్చే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంత గ్రామాల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. తదుపరి జిల్లా అధికారులతో కలెక్టర్ అత్యవసరంగా సమావేశం అయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పంట కాలువలకు కూడా ఎగువ నుంచి నీరు విడుదల చేసినందున, వరదలు వచ్చే ప్రమాదాన్ని ముందుగా పసిగట్టాలని తెలిపారు. నష్ట నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఉపద్రవాల్ని ఎదుర్కోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలన్నారు. ఇళ్ల మధ్య మురికి కుంటలలో నీరు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు నివారణకు మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని అరికట్టడానికి వైద్య బృందాల్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అవసరమైన ఔషధాలను ఆయా మండలాలలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో ఉంచాలని ఆదేశించారు. డెంగీ, చికున్ గున్యా, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధుల వ్యాప్తిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్. విజయమ్మ, డీపీవో రవి కుమార్, జల వనరుల శాఖ అధికారులు మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వండి పెట్టాలి



బాపట్ల: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వండి పెట్టాలని కలెక్టర్ జె.వెంకట మురళి సిబ్బందికి సూచించారు. బాపట్ల మండలంలోని కొండ భొట్లువారిపాలెం పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని, పరిసరాల్ని తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు.

ఆక్వా పార్కుతో రైతులకు మేలు

నిజాంపట్నం: ఆక్వా పార్కు ఏర్పాటుతో రైతులకు నాణ్యమైన రొయ్య పిల్లల్ని సరఫరా చేయడానికి అవకాశం లభిస్తుందని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మండలంలోని దిండి పంచాయతీ పరిధిలో ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్న భూముల్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 300 ఎకరాల భూమిని గుర్తించినట్లు చెప్పారు. ఇందులో మడ చెట్లు ఏర్పడిన 50 ఎకరాల భూమిని రిజర్వ్ ఫారెస్ట్ కింద అటవీ శాఖకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. మరో 50 ఎకరాలను పర్యాటక శాఖకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మరో 190 ఎకరాల్లో ఆక్వా పార్కును ఏర్పాటుకు గతంలోనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏపీలోని కోస్టల్ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు వెనామీ రొయ్యల సాగును చేస్తున్నారని, పిల్లల కోసం పాండిచ్చేరి, చెన్నై ప్రాంతాలకు వెళుతున్నారని తెలిపారు.అయితే, నాణ్యమైన అన్ని రకాల పిల్లల్ని ఇక్కడే తయారు చేసుకునేలా ఆక్వా పార్కులో హ్యాచరీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై సిద్ధంగా ఉన్న నేపథ్యంలో భూమిని పరిశీలించడానికి వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే ఆక్వా పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, టీడీపీ సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళి, పలువురు అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదకరం

- 6వ అదనపు జిల్లా జడ్జి కె.పి. బాలాజీ
- బాపట్లలో వన్ కే వాక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా జడ్జి కె.పి. బాలాజీ

బాపట్ల టౌన్: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ 6వ జిల్లా జడ్జి కె.పి. బాలాజీ సూచించారు. హెల్మెట్ వాడకంపై గురువారం పట్టణంలో వన్ కే వాక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై గడియారం స్తంభం, జీబీసీ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా జడ్జి బాలాజీ మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సూచించారు. మోటార్ వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు హెల్మెట్ లేకపోవడంతోనే సంభవిస్తున్నాయని తెలిపారు. హెల్మెట్ వాడకంతో వీటిని నివారించవచ్చని చెప్పారు. ద్విచక్ర వాహనానికి బీమా లేకపోవడంతో ప్రమాదాలలో మరణించిన వారికి నష్టపరిహారం అందడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. అలా ఇస్తే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే శిక్ష వాహన యజమానికే పడుతుందని తెలిపారు. ర్యాలీలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి జి.వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. రుక్మిణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్. సురేష్, బాపట్ల పట్టణ సీఐ యు. శ్రీనివాసులు, బాపట్ల ట్రాఫిక్ పోలీసులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బేపల్లి కొండ ఇకపై రిజర్వ్ ఫారెస్ట్

గ్రావెల్ తవ్వకాలు పూర్తిగా నిషేధం



మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొబ్బేపల్లి గ్రామంలోని కొండను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తించినందున, ఇక నుంచి గ్రావెల్ తవ్వకాలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ఎల్. భీమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన కొండ సమీపంలో సిబ్బందితో గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. గ్రామంలోని సర్వే నంబరు 387/సీ 11లో 357.27 ఎకరాల విస్తీర్ణంలో బొబ్బేపల్లి కొండ వ్యాపించి ఉంది. ఇప్పటివరకు రెవెన్యూ పరిధిలో ఉందనే సాకుతో అక్రమార్కులు దశాబ్దాలుగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. ఇటీవల ఈ ప్రాంతం 23-10-1894 నుంచి బ్రిటిష్ హయాంలోనే మద్రాస్ ఫారెస్ట్ యాక్ట్ (వీఆఫ్ 1882) పరిధిలోకి వచ్చిందని జియోలాజికల్ సర్వే రికార్డుల ద్వారా వెలుగు చూసింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని నిషేధిత జాబితాలోని ఫారెస్ట్ ప్రాంతాల్లో బొబ్బేపల్లి కూడా ఒకటని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ పేర్కొన్నారు. కొండపై గ్రావెల్ తవ్వకాలు గానీ ఇతర కార్యకలాపాలు నిర్వహించినా అటవీ సంరక్షణ చట్ట ఉల్లంఘనగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెన్యువల్ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకుల్ని రెన్యువల్ చేయాలని సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బీజే గాంధీ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3,618 మందిని నూతన విద్యాసంవత్సర ప్రారంభానికి ముందుగానే రెన్యువల్ చేయాలని, గత ఏప్రిల్, మే నెలల్లో అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల పునరుద్ధరణ విషయాన్ని నూతన ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని తెలిపారు. దీనిపై సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టి సారించి కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పట్టిస్తే ... గప్‌చుప్‌గా వదిలేశారు

- ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసి రాజమండ్రి వ్యక్తి
- చివరకు బాధితులే పట్టుకుని పట్టాభిపురం స్టేషన్‌లో అప్పగింత
- నిందితుడిని వదిలివేసిన పోలీసులు

పట్నంబజారు: ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఎంతో మంది యువకుల్ని మోసం చేసిన వ్యక్తి కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. చివరకు బాధితులే పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కానీ వారు అతడ్ని వదిలివేసిన సంఘటన గుంటూరులో చోటుచేసుకుంది. బాధిత యువకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన కోమల్ కొంత మంది యువకుల్ని ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికి మోసం చేశాడు. గుంటూరుకు చెందిన ముగ్గురు యువకుల వద్ద రూ.12 నుంచి రూ.14 లక్షల వరకు పలు దఫాలుగా తీసుకున్నాడు. గత ఆరు నెలల నుంచి కోమల్ కనిపించకపోవడంతో డబ్బు చెల్లించిన యువకులు అతడి కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎట్టకేలకు ఈనెల 17వ తేదీన విజయవాడలో పట్టుకున్నారు. డబ్బులు చెల్లించిన వారు విద్యానగర్‌కు చెందిన యువకులు కావడంతో సదరు మోసం చేసిన కోమల్‌ను పట్టాభిపురం స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పజెప్పారు. ఎస్‌ఐ శరత్‌చంద్ర సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించేందుకు దృష్టి సారించారు. 17వ తేదీ రాత్రి నిందితుడిని తీసుకెళ్లగా మరుసటి రోజు ఉదయం తీసుకురావాలని పోలీసులు సూచించారు. దీంతో ఉదయం కోమల్‌ను పట్టాభిపురం స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేషన్‌లో ఉన్న ఒక కానిస్టేబుల్‌కు అప్పజెప్పి యువకులు బయటే సీఐ కోసం ఎదురు చూస్తున్నారు. బాధితుల వద్ద ఉన్న నిందితుడి ఫోన్ కూడా కానిస్టేబుల్ వారిని బెదిరించి తీసుకుని నిందితుడికి అప్పజెప్పాడు. అతనికి స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఏఎస్‌ఐ కూడా వత్తాసు పలికాడు. ఈ క్రమంలో ఫోన్ తీసుకున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ కోమల్‌ను పట్టించుకోకపోవడంతో మెల్లిగా అక్కడి నుంచి ఉడాయించాడు. ఇదే విషయాన్ని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ మహేష్, పట్టాభిపురం సీఐ శరత్ చంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో కానిస్టేబుల్, ఏఎస్‌ఐలను ప్రశ్నించగా నీళ్లు నులిమిలారు. యువకులను మోసం చేసిన వ్యక్తి పరారై స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి నిందితుడిని పట్టుకోవడంతోపాటు, అతనిని సహకరించిన కానిస్టేబుల్, ఏఎస్‌లపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

మత్స్యకార భరోసాపై నీలినీడలు

- వేట నిషేధం పూర్తయ్యి నెల దాటినా దక్కని సాయం
- రీసర్వే పేరిట ప్రభుత్వం కాలయాపన



సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

చీరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అలవికానీ హామీలిచ్చింది. తీరా అమలు చేసే సమయానికి కుంటిసాకులతో సరిపెడుతోంది. తల్లికి వందనం మాదిరిగానే మత్స్యకార భరోసాపై మెలిక పెట్టింది. రీసర్వే పేరుతో కాలాయాపన చేస్తూ కష్టాల్లో చిక్కుకున్న గంగపుత్రులకు సాయం అందించం లేదు. తీరంలో వరుసగా అల్పపీడనాలు, వాయుగుండం కారణంగా మత్స్యకారుల వేట సక్రమంగా సాగడంలో లేదు. వేట నిషేధ కాలం ముగిసి నెల దాటింది. ఇంతవరకు సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. భరోసా నిధులు ఇవ్వడానికి కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చింది.

మత్స్యకారుల్లో ఆందోళన

కొత్త ప్రభుత్వం తీరు మత్స్యకారుల్లో ఆందోళన కలిగిస్తోంది. సముద్రంలో వేట తప్పా మరో పని తెలియదు. ఏటా మే 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధం ఉంటుంది. ఈ సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ రూ. 10 వేలు చొప్పున అందుకున్నారు. దీంతో మత్స్యకారులు అవస్థలు పడకుండా వేట నిషేధ సమయాన్ని పూర్తి చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ భృతి మంజూరుపై నిర్ణయం చేయకపోవడంలో ఆందోళన చెందుతున్నారు.

హామీ అమలుపై అనుమానాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భరోసాను రూ.10 వేల నుంచి రూ. 20 వేలు పెంచుతామంటూ హామీ ఇచ్చింది. దీనిపై కొంతమంది మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు ఇప్పటివరకు సర్వే చేసి ఈ ఏడాది 12,500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రూ.20 వేలు చొప్పున రూ. 25 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది.

రీసర్వే పేరుతో కాలయాపన

జిల్లాలో చీరాల, వేటపాలెం, బాపట్ల, రేపల్లె, బీబీ పాలెం మండలాలున్నాయి. వీటి పరిధిలో 76 కిలోమీటర్ల మేర తీరం ఉంది. 12,500 మంది లబ్ధిదారులున్నారు. వాస్తవానికి వేట నిషేధ సమయంలో 18 వేలకు మంది పైగానే మృత్యకారులు ఇంటి వద్ద ఉంటూ వలల్ని మరమ్మతుల్ని చేసుకుంటుంటారు. ఈ క్రమంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్ష సర్వే ద్వారా అర్హుల్ని గుర్తించి వారికి పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేసేవారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండు నెలల కిందటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హుల్ని గుర్తించారు. అయితే, కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీసర్వే అంటూ మెలిక పెట్టింది. గత టీడీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రూ. 4వేలు ఇస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాన్ని రూ. 10 వేలకు పెంచింది. అయితే, కూటమి ప్రభుత్వం రీసర్వే పేరుతో పింఛన్‌దారులు, ప్రభుత్వం నుంచి ఏదైనా లబ్ధి పొందుతున్న వారిని జాబితా నుంచి తొలగిస్తారనే అనుమానాలు మత్స్యకారుల్లో ఉన్నాయి.

రీ సర్వే చేస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే చేస్తున్నాం. ప్రభుత్వం కొన్ని కొత్త నిబంధనలు సూచించింది. దాని ప్రకారం పూర్తిస్థాయిలో రీసర్వే జరిపి నివేదిస్తాం. ఇప్పటి వరకు జిల్లాలో 12,500 మందిని లబ్ధిదారులుగా గుర్తించాం. జిల్లా ఏర్పడిన మూడేళ్లలో గత ప్రభుత్వం హయాంలో రూ. 28 కోట్ల వరకు పరిహారం అందించాం.

– సురేష్, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ బాపట్ల.


జల్‌జీవన్ మిషన్ కేంద్ర పరిశీలన



కొళాయి నీటి నాణ్యత పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడికొండ: తుళ్లూరు మండలంలోని వెలగపూడి, మల్కాపురం, అబ్బరాజుపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం కేంద్ర పరిశీలన బృందం సభ్యులు పర్యటించారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు, నీటి నాణ్యత, పరిమాణం, శుభ్రత తదితర అన్ని పరిమాణాలు పాటిస్తూ నీటి సరఫరా జరుగుతుందా ? అనే విషయాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. నీటిని సేకరించి అక్కడే పలు పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పర్యటించి నీటి శుభ్రతా పరిమాణాలు పాటించాల్సిన అంశాలపై సూచనలు అందజేశారు. కేంద్ర బృందం పరిశీలన సభ్యులు శ్రీ విద్య, జయకుమారి, సుజాత, మురళి, నిశాంత్‌లు పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. వీరి వెంట జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం రేష్మ, జేజేఎం జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు, స్వచ్ఛ భారత్ మిషన్ తుళ్లూరు మండల కోఆర్డినేటర్ కె బిక్షం, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



నర్సింగపాడులోని దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నకరికల్లు: అనుమతులు, సరైన బిల్లులు లేకుండా అమ్మకాలు, కొనుగోళ్లు జరిపితే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నర్సింగపాడు, చల్లగుండ్ల, నకరికల్లు గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో గురువారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు నిల్వలు, బిల్లుల పుస్తకాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల లైసెన్స్, ఫామ్-ఓ జతచేయని వాటి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. నర్సింగపాడు గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఫాం-ఓ లేనందువల్ల రూ 1.17 లక్షల విలువైన 19.8 టన్నుల యూరియా అమ్మకాలు నిలిపివేశామన్నారు. చల్లగుండ్లలోని శ్రీశ్రీనివాస ట్రేడర్స్ ఎరువులు, పురుగుమందుల దుకాణంలో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనందున రూ. 34 వేల విలువైన 31.5 లీటర్ల పురుగుమందుల అమ్మకాలు ఆపేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ కె.రమణ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఈపూరు: గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఈపూరు సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఈపూరు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గోవా నుంచి 400 మద్యం బాటిళ్లు తీసుకొస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వినుకొండ సెబ్ సీఐ జిలానీ, ఎస్‌ఐ రేవతి తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

యార్డులో 38,465 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 38,465 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 35,887 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.18,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,453 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.